ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించాలి

- ల్యాబ్ పరికరాలను అందుబాటులోకి తేవాలి
- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


దాక్టర్లకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : పేదలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించేలా సేవలు అందించాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలను పరిశీలించి ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. అక్కడక్కడ కొన్ని మరమ్మతులు ఉన్నాయని, వాటిని త్వరలో పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. కోవూరు ఆస్పత్రి మరమ్మతుల కోసం రూ.50 లక్షలతో ప్రతిపాదనలు పంపారని, ఆ నిధులు త్వరగా మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. బయట వైద్యానికి వేలాది రూపాయలు ఖర్చవుతున్నాయని, వాటిని భరించలేక ప్రభుత్వ వైద్యశాలకు వస్తున్న పేదలను ప్రభుత్వ ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకోవాలని బయటకు పంపడం సరికాదన్నారు. అలాంటి సమస్యలు తన దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. రక్త పరీక్షల కోసం విలువైన పరికరాలు ల్యాబ్‌కు వచ్చాయని, వాటిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

సిబ్బందిపై ఆగ్రహం

ఆస్పత్రి ఆవరణలో గడ్డి తొలగించేందుకు మెషీన్లను వినియోగించాలని పారిశుద్ధ్య కార్మికుల నుంచి వైద్య సిబ్బంది రూ.500 వసూలు చేశారని, అయితే అందుకు మరలా బిల్లులు పెట్టుకున్నారని కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వైద్య సిబ్బందిపై ఎమ్మెల్యే ప్రసన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్కువ జీతాలు తీసుకునే పారిశుద్ధ్య కార్మికుల వద్ద కూడా ఇలా వసూలు చేయడం ఏమిటని, మరోసారి పునరావృతం అయితే సహించేది లేదని స్పష్టం చేశారు.

ఎన్‌ఎస్‌ఆర్ ట్రస్టు ద్వారా చేయూత

ఆస్పత్రిలోని బాలింతల వార్డును ఎమ్మెల్యే ప్రసన్న పరిశీలించారు. ప్రస్తుతం వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో పసిబిడ్డలు, బాలింతలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు ద్వారా 2 లేదా 3 ఏసీలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం వైద్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆస్పత్రి అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఆయన వెంట డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విజేత, వైద్యులు బెట్టి, పెంచల స్వామి, చలపతి, సలావుద్దీన్, ప్రవళిక, కేశవకుమార్, వైద్యారోగ్య సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

నేదురుమల్లికి అభినందన



కొడవలూరు : వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. వైఎస్సార్‌సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు చక్కా మనోహర్‌బాబు, నేతలు వి.వెంకటేశ్వర్లు, బొర్రయ్య ఉన్నారు.

గౌతమ్‌నగర్‌లో 'ఫ్యామిలీ డాక్టర్'



కొడవలూరు : మండలంలోని గౌతమ్ నగర్‌లో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఓపీ ద్వారా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఓపీకి రాలేని స్థితిలో ఉన్న ఇద్దరి ఇళ్లకు వైద్య సిబ్బంది వెళ్లి పరీక్షలు చేశారు. వైద్య సలహాలిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.రామకృష్ణ, డాక్టర్ కిశోర్, హెల్త్ విజిటర్ పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో అక్కా, తమ్ముడి ప్రతిభ


కారుణ్య, లోకేశ్వర్‌రెడ్డిలను అభినందిస్తున్న ఎంఈఓ

బుచ్చిరెడ్డిపాళెం : చెస్ పోటీల్లో ప్రతిభ చూపిన మునగాల కారుణ్య, మునగాల లోకేశ్వర్‌రెడ్డిలను మండల విద్యాశాఖాధికారి దిలీప్‌కుమార్ తన కార్యాలయంలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ చెస్ ఫైడ్ ర్యాపిడ్ రేటింగ్ పోటీల్లో కారుణ్య 1160 ర్యాంక్‌తో, లోకేశ్వర్‌రెడ్డి 1037 ర్యాంక్‌లతో ప్రతిభ చూపారన్నారు. వీరు విద్యతో పాటు చెస్‌లో కూడా రాణించడం చాలా సంతోషంగా ఉందని, వీరికి కోచ్‌గా ఉన్న వేముల ప్రదీప్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు మహేంద్రరెడ్డి, లక్ష్మిలను అభినందించారు.

పంటకోత ప్రయోగాలతో దిగుబడుల అంచనా


కోడూరులో పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఏఓ

తోటపల్లిగూడూరు : పంటకోత ప్రయోగాలతో పంట దిగుబడులను అంచనా వేయవచ్చని మండల వ్యవసాయాధికారి గీతాకుమారి సూచించారు. మండలంలోని కోడూరు బిట్-2 గ్రామంలో బుధవారం జరిగిన పంటకోత ప్రయోగాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి ప్రస్తుతం మండలంలో రబీ వరికోతలు ప్రారంభమైందన్నారు. ఈ క్రమంలో దిగుబడులను అంచనా వేసేందుకు పంటకోత ప్రయోగాలను చేపడుతున్నామన్నారు. కోడూరు బిట్-2లోని సర్వే నంబర్ 1251-ఏలో చేపట్టిన ప్రయోగంలో ఎకరాకు నాలుగు పుట్ల దిగుబడి వస్తాయని అంచనా వేశామన్నారు. మండలంలో అన్ని ప్రాంతాల్లో పంటకోత ప్రయోగాలు చేపడుతామన్నారు. వ్యవసాయశాఖ సహాయకుడు శశి, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి నరసింహుని బ్రహ్మోత్సవాలు

ఇందుకూరుపేట : ఇందుకూరుపేటలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 8వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయని ఆలయ ప్రధానార్చకుడు ఉదయగిరి వెంకటశేషాచార్యులు బుధవారం తెలిపారు. 6న స్వామి కల్యాణోత్సవం, 7న రథోత్సవం జరుగుతుందని చెప్పారు.

3న టీపీగూడూరులో జాబ్‌మేళా

తోటపల్లిగూడూరు : ఈనెల 3వ తేదీన తోటపల్లిగూడూరులో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎన్‌డీఆర్ గ్రూపు సంస్థల చైర్మన్ నాయుడు ఆదికేశవులరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన తల్లి, దివంగత నాయుడు నాగేశ్వరమ్మ వేదిక ట్రస్టు ద్వారా యువతకు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్స్‌లో అనుభవం కల్గిన యువతీ యువకులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఇంటర్వ్యూలో అర్హత సాధించిన వారికి మూడు నెలల శిక్షణ అనంతరం ఎన్‌డీఆర్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ చెన్నైలో ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. తోటపల్లిగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 3వ తేదీ ఉదయం 10 గంటల ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

సీఎంకు ధన్యవాదాలు

పొదలకూరు : తోడేరు దుర్ఘటనలో బాధితుల కుటుంబాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకోవడంపై వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబాల పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకెళ్లారని, ఆయన రూ.5 లక్షల పరిహారం ప్రకటించడం అభినందనీయమన్నారు.

కల్యాణం.. కమనీయం


విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు


కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని అలగానిపాడులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిరంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం బుధవారం రాత్రి కమనీయంగా సాగింది. తొలుత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా ప్రధాన దేవతా హోమాలు, యంత్రశుద్ధి, శిఖర ప్రతిష్ఠ కలాపం, పూర్ణాహుతిని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రి జరిగిన కల్యాణానికి భక్తులు విశేషంగా తరలివచ్చి వీక్షించారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా శ్రీనివాసులు-నాగజ్యోతి వ్యవహరించారు.

విద్యార్థులకు అభినందన



మనుబోలు : పొదలకూరు మండలం, మహ్మదాపురం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో గత నెలలో జరిగిన గ్రిగ్స్ పోటీల్లో మండలంలోని మడమనూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. వీరిని మడమనూరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం మస్తానయ్య, పీడీ మురళీధర్‌రావు బుధవారం అభినందించారు. బాలికల టెన్నీకాయిట్‌లో జూనియర్, సీనియర్స్ విభాగాల్లో ఈ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. సీనియర్స్ వాలీబాల్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు.

అగ్నిప్రమాదాలపై జాగ్రత్తలు


వైద్యులకు సూచనలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోవూరు : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో డాక్టర్లు, వైద్యసిబ్బందికి అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బుధవారం వివరించారు. ప్రమాదం జరిగినప్పుడు కంగారు పడకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని వారు తెలిపారు. ఎమర్జెన్సీ డోర్లను వినియోగించడం, మంటలను నివారించే పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

షుగర్‌లెస్ వరికోతలు ప్రారంభం


వరికోతలు ప్రారంభించిన వ్యవసాయ కూలీలు

ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నం పంచాయతీ, గోపాలపురంలో రబీ సీజన్‌కు సంబంధించి వరికోతలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతంలో రైతులు కొందరు షుగర్‌లెస్ రకం వరి సేద్యం చేపట్టారు. ఈ రకాన్ని మండలంలో సుమారు 2,000 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. గోపాలపురంలో కూడా కొందరు రైతులు సాగు పూర్తి కావడంతో యంత్రాల ద్వారా కోతలు ప్రారంభించారు. మండలంలో అత్యధికంగా సాగు చేసిన బీపీటీ రకం వరి పంట మరో వారం రోజుల్లో కోతలకు వస్తాయని వ్యవసాయాధికారులు వెల్లడించారు.

విద్యా ప్రమాణాల మెరుగునకు కృషి చేయాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కొడవలూరు : విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల మెరుగునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీఓ పి.సుబ్రమణ్యం సూచించారు. కొడవలూరు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈఓ జి.వసంతకుమారితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. అంతా బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం టి.లక్ష్మీభవాని ఉన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పొదలకూరు : మండలంలోని వనంతోపు సెంటర్‌లో పొదలకూరు ఎస్‌ఈబీ అధికారులు బుధవారం నిర్వహించిన దాడుల్లో ఓ యువకుడి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ వెంకటరావు కథనం మేరకు.. మొగళ్లూరుకు చెందిన ఎం.మాల్యాద్రిరెడ్డి కొంతకాలంగా వనంతోపు సెంటర్‌లో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నాడు. దీనిపై సెబ్ అధికారులు నిఘా ఉంచి అతని వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

81.54 శాతం పింఛన్ల పంపిణీ


మామిడిపూడిలో వేకువజామున పింఛన్ అందజేస్తున్న వలంటీర్

ముత్తుకూరు : మండలంలో ప్రభుత్వ సామాజిక పింఛన్ల పంపిణీ బుధవారం 81.54 శాతం జరిగినట్లు ఎంపీడీఓ ప్రత్యూష తెలిపారు. ఇందులో భాగంగా వేకువజాము నుంచే వలంటీర్లు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. చాలా గ్రామాల్లో ఉదయం 10 గంటలకే పంపిణీని పూర్తి చేశారు. మామిడిపూడిలో వలంటీర్ హసీనా బేగం ఉదయం 5 గంటలకు ఇల్లిల్లూ తిరిగి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లను అందజేశారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

వెంకటాచలం : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విజయవాడ లయోలా కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో మండలంలోని నిడిగుంటపాళెం విద్యార్థిని బి.మనోజ ప్రతిభ చూపింది. ఈ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా, అందులో పదో తరగతి చదువుతున్న మనోజ పాల్గొని ప్రతిభ చూపడంతో ప్రశంసాపత్రం అందుకుంది. దీంతో మనోజను పాఠశాల హెచ్‌ఎం మరుధ్వతి, గైడ్ టీచర్ ప్రసాద్ బుధవారం అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ డివైడర్‌ను ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని పుంజులూరుపాడు వద్ద కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై బుధవారం చోటుచేసుకుంది. నాయుడుపేట ప్రాంతానికి చెందిన షేక్.రసూల్ పని నిమిత్తం బైక్‌పై కృష్ణపట్నం వెళ్లాడు. తిరిగి నాయుడుపేటకు వెళ్తుండగా పుంజులూరుపాడు సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై మోటారు బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రసూల్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.